నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

కంఠేశ్వర్, ఆగస్టు 17 : నగరంలోని పలు డివిజన్లలో మున్సిపల్ కమిషనర్ మకరంద్ శనివారం పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అర్సపల్లి రైల్వేట్రాక్ వద్ద గ్రావెల్ పనులను పరిశీలించారు. అనంతరం పూలాంగ్ వద్ద ఉన్న జోన్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులపై సమావేశం

కంఠేశ్వర్, ఆగస్టు 17 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ, వివిధానాలపై అధికారులు శనివారం సమావేశమయ్యారు. అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, డీపీవో చక్రవర్తి తరుణ్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్యామ్‌కుమార్, వివిధ పట్టణాల మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళికా అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

- **హాజరైన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం**

కోటగిరి, ఆగస్టు 17 : మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో నాలుగు రోజులుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించగా.. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. ఆలయం వద్ద పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

వినాయక్‌నగర్, ఆగస్టు 17 : నగరంలోని గోడౌన్ రోడ్డు పరిధి, రాంగోపాల్ స్ట్రీట్ ప్రాంతంలో స్థానికులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శనివారం ప్రారంభించారు. కాలనీవాసులు స్వచ్ఛందంగా 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి యోగా పోటీలు

సుభాష్‌నగర్, ఆగస్టు 17 : తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి ముగింపు పోటీలను బస్వాగార్డెన్‌లో శనివారం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బస్వా లక్ష్మీ నర్సయ్య, యోగా రాంచందర్, బాలశేఖర్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఏసీపీ కార్యాలయ ప్రహరీ

వినాయక్‌నగర్, ఆగస్టు 17 : నిజామాబాద్ ఏసీపీ కార్యాలయ ప్రహరీ శనివారం ఉదయం కూలిపోయింది. ప్రహరీ శిథిలావస్థకు చేరుకోవడం, శుక్రవారం కురిసిన వర్షానికి తడిసి కూలిపోయింది. దీంతో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ఏసీపీ కార్యాలయం బహిరంగంగా కనిపిస్తున్నది.

భూమి కాపాడాలి

నందిపేట్, ఆగస్టు 17: మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో మీది ఆడకట్టు ప్రాంతంలో సర్వే నంబర్ 902, 903లోని భూమిని భూమిని కాపాడాలని కోరుతూ ఆయా కుల సంఘాల ప్రతినిధులు శనివారం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తజనం

లింబాద్రి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

భీమ్‌గల్, ఆగస్టు 17: మండల కేంద్రంలోని లింబాద్రిగుట్ట లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. దర్శనానికి సుమారు 3 నుంచి 4 గంటల సమయం పట్టింది. ఆలయం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

PUBLIC NOTICE

General Public/Banks/Financial Institutions, are hereby informed that my client **Sri. Kammari Chinna Narsaiah S/o Kammari** Narsaiah, R/o.H.No.4-105-35/2, Nyalkal (Village), Mugpal (Mdl), Nizamabad, Dist, has entered into an Agreement of Sale for purchase of below mentioned Schedule Property, from its lawful owner/s **Smt. Kandukuri Balamani W/o Late. K.Laxmaiah,** who Purchased the same through Regd. Sale Deed No.5093/1999, JSRO, Nizamabad accordingly my client paid part payment towards sale consideration. There fore, call upon general Public/ Banks/ financial institutions in particulars are here by having any objections or any charge or claim over the said property, they may approach with relevant evidence/documents to the undersigned within **7 days** of this publication, failing which my client will proceed with sale transaction and conclude the same by paying total amount and get it registration in favour of my client. Further if any objections received / raised will not be entertained.

::: SCHEDULE PROPERTY :::

All That the Open Plot No.107, Ext. 173.34 Sq.yds & Part of Open Plot No. 108, Ext. 28.88 Sq.yds, Total Ext. 202.22 Sq.yds, lies in Sy.Nos. 583 to 589, Situated at Nizamabad Shivar of Ward No.3, Block No.3 of Gayathri Nagar, Nizamabad, within Municipal limits of Nizamabad.

AS BOUNDED BY: North: Plot No.106, **South:**Remaining Part of Same Plot No.108, **East:** 25'.0" Wide Road & **West:** Plot Nos.117 & 116

Sd/- E. JAYASIMHA, Advocate
Nizamabad, Cell No.9490242033

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

జక్రాన్‌పల్లి/ సిరికొండ, ఆగస్టు 17 : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి శనివారం అవగాహన కల్పించారు. మండలకేంద్రంతో పాటు పడకల్, పడకల్ తండా, గాంధీనగర్ గ్రామాల్లో హెల్మెట్ ప్రాముఖ్యతను వాహనదారులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు సుశీల్‌కుమార్, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు. సిరికొండ మండలంలోని రావుట్ల, నర్సింగ్‌పల్లి గ్రామాల్లో హెల్మెట్‌పై ఎస్సై రామ్ అవగాహన సదస్సు నిర్వహించారు.

హోరెత్తిన వైద్యుల నిరసన

- **కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై ఆగ్రహం**
- **నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్**

జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ, వైద్యులు, సిబ్బంది

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 17 : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య చేయడంపై జిల్లావ్యాప్తంగా వైద్యారోగ్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంతోపాటు వివిధ మండలాలు, గ్రామాల్లో శనివారం నిరసనలు చేపట్టారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని దవాఖానల్లో 24 గంటలపాటు ఓపీ సేవలను నిలిపివేశారు. జిల్లాకేంద్రంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, వైద్యులు, సిబ్బందితో ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మోస్రా పీహెచ్‌సీ వద్ద వైద్యుడు విజయ్ కుమార్, సిబ్బంది నిరసన తెలిపారు. కోటగిరి సీహెచ్‌సీ వద్ద డాక్టర్ సుప్రియ, ఆరోగ్య శాఖ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లాకేంద్రంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. డిచ్‌పల్లిలోని సీహెచ్‌సీ, ధర్పల్లి ప్రభుత్వ దవాఖాన, ఇందల్వాయి పీహెచ్‌సీ, రుద్రూర్ పీహెచ్‌సీల వద్ద వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు.

బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో వైద్యులు, సిబ్బంది నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుంచి ఓపీ సేవలు అందించిన అనంతరం మధ్యాహ్నం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సుమంత్, ఆర్ఎంవో రాహుల్‌తోపాటు పలువురు వైద్యులు, సిబ్బంది ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. బోధన్ పీఎంపీల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలోని ప్రైవేట్ దవాఖానల్లో ఓపీ సేవలు నిలిపివేశారు. ఆర్మూర్ పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్‌లో ట్రైనీ డాక్టర్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వైద్యులు మౌనం పాటించారు. నందిపేట్ ప్రాథమిక వైద్యులతో పాటు సిబ్బంది నిరసనతెలిపారు. నవీపేట కమ్యూనిటీ ఎల్త్ సెంటర్‌లో డాక్టర్ కావ్య అధ్వర్యంలో సిబ్బంది నిరసన తెలిపారు. ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ఫిర్దోజ, ఆయుష్మాన్ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఖలీల్‌వాడి, ఆగస్టు 17 : ఐఎంఏ, తానా వైద్యులు ఓపీ సేవలు నిలిపివేసి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అండ్ తెలంగాణ ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గంగస్థాన్‌లోని ఐఎంఏ భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డాక్టర్ మౌమిత ఆత్మకు శాంతి చేకూరాలని నగరంలోని ప్రముఖ వైద్యులు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు.

ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు

డిచ్‌పల్లి సీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఏసీబీ కేసులో విచారణ

ధర్పల్లి, ఆగస్టు 17 : ధర్పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా 10 సంవత్సరాల క్రితం పని చేసిన సంధ్యారాణి ఏసీబీ కేసుకు సంబంధించి అధికారులు శనివారం విచారణ చేపట్టారు. డీపీవో తరుణ్‌కుమార్, నిజామాబాద్ ఏసీబీ అధికారి నాగేశ్ ధర్పల్లి జీపీలో విచారణ చేపట్టారు. కేసు పెట్టిన బాధితురాలు విచారణకు రాలేదని వెల్లడించారు. వారి వెంట ఎంపీడీవో బాలకృష్ణ, కార్యదర్శి సైపుద్దీన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా హెడ్ కానిస్టేబుళ్లకు గాయాలు

వినాయక్‌నగర్, ఆగస్టు 17 : నగర శివారులోని నాగారం ఏరియాలో శనివారం అక్రమ నిర్మాణాలను కూల్చివేతకు రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయం తీసుకున్నారు. ఇద్దరు మహిళా హెడ్‌కానిస్టేబుళ్లు నాగారం వద్దకు వెళ్తుండగా తమ ద్విచక్రవాహనంపై నుంచి కింద పడడంతో గాయాలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు.

హెల్మెట్ ధరించని వారిపై కేసులు తప్పవు

వినాయక్‌నగర్/మోర్తాడ్/శక్కర్‌నగర్/రెంజల్/భీమ్‌గల్/ఏర్గట్ల, ఆగస్టు 17 : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్న నిబంధనలు ఈనెల 15 నుంచి అమలులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాకేంద్రంలో శనివారం ఏసీపీ రాజా వెంకట్‌రెడి సూచనలు, నగర సీఐ నరహరి పర్యవేక్షణలో ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోర్తాడ్‌లో హెల్మెట్ వినియోగంపై యువకులకు భీమ్‌గల్ సీఐ నవీన్ అవగాహన కల్పించారు. బైక్‌నడిపే ప్రతి వ్యక్తి హెల్మెట్ తప్పకుండా ధరించాలని చెప్పారు. కారు నడిపేవారు సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ వాహనదారులకు అవగాహన కల్పించారు. రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో హెల్మెట్ వినియోగంపై బోధన్ రూరల్ సీఐ నరేశ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఎస్సై సాయన్న, మాజీ సర్పంచ్ రాజు పాల్గొన్నారు. భీమ్‌గల్ పట్టణంలో వాహనదారులకు ఎస్సై మహేశ్ అవగాహన కల్పించి మాట్లాడారు. ఏఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఏర్గట్ల మండల కేంద్రం ఎస్సై రాము అవగాహన కల్పించారు.

నగరంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

వీరన్నగుట్టలో అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ నరేశ్‌కుమార్

ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- **ధర్పల్లిలో రైతుల ధర్నా**

ధర్పల్లి, ఆగస్టు 17 : ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ధర్పల్లి మండలకేంద్రంలోని గాంధీచౌక్ వద్ద శనివారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, చెప్పి బ్యాంకులకు వెళ్లి కొత్త రుణాలు తీసుకోవాలని గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. కఠినమైన నిబంధనలు పెట్టి కొందరికే రుణమాఫీ చేయడం దారుణమన్నారు. అర్హులైనప్పటికీ రుణమాఫీ కాని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ చేయకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు సబావత్ శ్రీనివాస్‌నాయక్, శంకర్‌నాయక్, శివరాంనాయక్, సుమన్, పరశురాంనాయక్ పాల్గొన్నారు.

ధర్పల్లిలో గాంధీచౌక్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సొసైటీల నిర్లక్ష్యంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిరికొండ, ఆగస్టు17: సిరికొండ, తూంపల్లి సొసైటీ అధికారులు ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు చేయకపోవడంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులు, సొసైటీ పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకుడు రమేశ్ డిమాండ్ చేశారు. సిరికొండలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. సిరికొండ సొసైటీలో అవకతవలు జరిగాయని ఆరోపించారు. అధికారులు విచారణకు వచ్చినా సొసైటీ పాలకవర్గం హాజరుకాకపోవడంతో దీనిపై మరింత అనుమానం పెరిగిందన్నారు. సమావేశంలో నాయకులు దామోదర్, రమేశ్, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన రైతులు

మోర్తాడ్, ఆగస్టు17: రుణమాఫీపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేములప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నాకు రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఎమ్మెల్యేతోపాటు రైతులు రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో చేశారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు కిలోమీటర్ల మేర నిలచిపోయాయి. వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల నుంచి రైతులు తరలివెళ్లారు. **2600 మంది రుణాలు తీసుకోగా 600 మందికే మాఫీ**

నవీపేట, ఆగస్టు 17: జన్నేపల్లి సిండికేట్ బ్యాంక్ వద్ద రైతులు ఆందోళన చేశారు. శుక్రవారం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో తమ పేరు లేదంటూ బ్యాంక్ పరిధిలోని రైతులు బ్యాంక్‌కు తరలి వచ్చారు. బ్యాంక్‌లో 2600 మంది రైతులు రుణాలు తీసుకోగా కేవలం 600 మందికి మాత్రమే రుణ మాఫీ అయ్యిందని పలువురు పేర్కొన్నారు.

కెనారా బ్యాంకు వద్ద..

ఆలూర్, ఆగస్టు17: తమకు రుణమాఫీ కాలేదంటూ ధర్నా మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తిమ్మాపూర్ గ్రామం నుంచి ధర్నాకు వెళ్తున్న రైతులు

రుణమాఫీ కాని రైతుల కోసం అధికారుల నియామకం

- **రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి**

కంఠేశ్వర్, ఆగస్టు 17 : రైతు రుణమాఫీలో అవినీతి జరగలేదని, రుణమాఫీ కాని రైతుల కోసం ప్రత్యేకంగా వ్యవసాయాధికారులను నియమించామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ధర్పల్లి, ఆగస్టు 17 : మండలంలోని హోన్నాజీపేట్‌కు చెందిన మిద్దెల లక్ష్మి (59) ఉరేసుకొని మృతిచెందింది. ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. లక్ష్మి భర్త కొన్నేండ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. లక్ష్మి తన కుమారుడు మిద్దెల రాజుతో కలిసి ఉంటున్నది. రాజు తన భార్యాపిల్లలతో శుక్రవారం బంధువుల ఇంటికి వెళ్లగా ఒంటరిగా ఉన్న లక్ష్మి దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. శనివారం ఇంటికి వచ్చి చూసేసరికి తన తల్లి ఆత్మహత్య చేసుకొని ఉండడంతో రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త చనిపోయినప్పటి నుంచి ఒంటరిగా అనిపిస్తున్నదని, తాను కూడా చనిపోతానని పలుమార్లు అనేదని మృతురాలి కుమారుడు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

బాల్కొండ/నవీపేట, ఆగస్టు 17: బాల్కొండ మండల వ్యవసాయాధికారినిగా బద్దం లావణ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మోర్తాడ్ మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన మహేందర్‌రెడ్డి అర్బన్ వ్యవసాయాధికారిగా బదిలీ అయ్యారు. నవీపేట ఏవోగా అధికారిగా నవీన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేశ్‌గౌడ్ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జుక్కల్ నుంచి ఏవో వచ్చారు.

గ్రామాల్లో జ్వర సర్వే చేపట్టాలి

రెంజల్, ఆగస్టు 17: సాటాపూర్, రెంజల్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ హాజరై మాట్లాడారు. ఏఎన్ఎంలు జ్వర సర్వే చేపట్టి ప్రజల ఆరోగ్య పరిస్థితులను గుర్తించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్యదర్శి రాజేందర్‌రావు, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మోర్తాడ్, ఆగస్టు17: కమ్మర్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన చింత బలరాం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రదీప్ 66 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ ప్రింటెడ్ హాండ్‌రైటింగ్ నోట్ పుస్తకాలను అందజేయగా వాటిని శనివారం ఎంఈవో ఆంధ్రయ్య విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయుడు రవికుమార్, సీఆర్పీలు అంజయ్య, రాజేశ్, లలిత, నాయకుడు లుక్కగంగాధర్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

మోర్తాడ్, ఆగస్టు17: ఉప్లూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి సరసం గంగారెడ్డి ట్రస్ట్ నుంచి లక్షరూపాయల చెక్కును శనివారం డాక్టర్ సరసం రాజేశ్వర్, సరసం చిన్నారెడ్డి గ్రామకమిటీకి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సోమ దశరత్, కొమ్ముల రవీందర్, రాజేశ్వర్, ధన్‌రెడ్డి, నాగేశ్, మోహన్, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

అలీసాగర్ నీటి విడుదల వాయిదా

నవీపేట, ఆగస్టు 17: అలీసాగర్ నీటి విడుదలను వాయిదా వేసినట్లు అలీసాగర్ ప్రాజెక్టు ఏఈ ప్రణయ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కోస్లీ గోదావరి నది వద్ద మొదటి పంప్ వద్ద అలీసాగర్ నీటి విడుదలను స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేయాల్సి ఉందని తెలిపారు. కొన్ని రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో నీటి విడుదలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిరోజూ కళాశాలలకు హాజరయ్యేలా చూడాలి

- **జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్**

ఖలీల్‌వాడి, ఆగస్టు 17 : విద్యార్థులకు మెరుగైన బోధన చేయడంతోపాటు కళాశాలలకు ప్రతిరోజూ హాజరయ్యేలా చూడాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (ఖిల్లా), ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలను ఆయన శనివారం తనిఖీ చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ, ఆన్‌లైన్ నమోదు, వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం తదితర అంశాలపై అధ్యాపకులతో సమీక్షించారు. కళాశాలల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

ఓయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల సమావేశం

- **పాల్గొన్న టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు**

డిచ్‌పల్లి, ఆగస్టు 17 : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు. నెలరోజుల్లో బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన స్కేల్ అమలు, రెగ్యులరైజ్ చేయడం తదితర అంశాలపై చర్చించినట్లు టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు తెలిపారు.

బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఖలీల్‌వాడి, ఆగస్టు 17 : జిల్లాకేంద్రంలోని ఎస్‌బీఐలో వై.నర్సయ్యకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్లెయిమ్‌కు సంబంధించి రూ. 2 లక్షల చెక్కును రీజినల్ మేనేజర్ మహేశ్వర్ కోలేటి శనివారం అందజేశారు. చీఫ్ మేనేజర్ రవి, బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్ - కాచిగూడ రైలు ప్రారంభం

బోధన్, ఆగస్టు 17: సుమారు మూడు నెలల విరామం అనంతరం బోధన్ నుంచి ప్యాసింజర్ రైలు శనివారం ప్రారంభమైంది. బోధన్ – కాచిగూడ ప్యాసింజర్ రైలు బోధన్ రైల్వే స్టేషన్ నుంచి శనివారం ఉదయం 5.30 గంటలకు బయల్దేరింది. ఈ రైలు నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్ మీదుగా కాచిగూడకు ఉదయం 11 గంటలకు చేరుకుంటుంది. అక్కడినుంచి గుంతకల్లుకు వెళ్తుంది. కాచిగూడ నుంచి సాయంత్రం 4.30 గంటలకు బోధన్‌కు రైలు బయల్దేరి రాత్రి 11 గంటలకు బోధన్‌కు చేరుకుంటుంది.

రేపు బుద్ధి రాజేశ్వర్ విగ్రహావిష్కరణకు భూమిపూజ

బోధన్, ఆగస్టు 17: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా నాయకుడు బుద్ధి రాజేశ్వర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ కోసం సాలూర మండల కేంద్రంలో సోమవారం భూమి పూజ చేయనున్నట్లు బుద్ధి రాజేశ్వర్ అభిమానుల సంఘం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. బుద్ధి రాజేశ్వర్ పెద్ద కుమార్తె సంధ్య, అల్లుడు పవన్ వర్మ పూజ చేస్తారని వారు తెలిపారు. విగ్రహం నెలకొల్పేందుకు సాలూరకు చెందిన అన్నదమ్ములు ఇల్తెపు బొర్ర గంగారాం, ఇల్తెపు పోశెట్టి తమ స్థలాన్ని విరాళంగా ఇచ్చారని తెలిపారు.

పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్

ఏర్గట్ల మండలం తడపాకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో తోటి విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

భీమ్‌గల్/ఏర్గట్ల/నందిపేట్/ధర్పల్లి, ఆగస్టు 17: భీమ్‌గల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎంఈవో స్వామి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు రక్షాబంధన్ పండుగ నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు లింబాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అధికారులకు రాఖీలు కట్టారు. ఏర్గట్ల మండల కేంద్రంతోపాటు తడపాకల్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టారు. నందిపేట్‌లోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో